వరకట్న పరిణామము

శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

"ఏమండీ? ఎప్పుడూ మీ క్యాంపులేమో మీ పనేమి తప్ప ఇంటిగొడవలే పట్టదాయె. ఇంట్లో జరగాలిసిన పన్లు ఎల్లా జరుగుతాయి?"

భాస్కర్రావు క్యాంపునుంచివచ్చి భోంచేసి నిద్రొచ్చే నిమిత్తం గృహలక్ష్మి చేతబట్టుకుని చూస్తూ కండ్లు మూస్తున్నాడు. ఇంతలో భార్య పిలుపు విని విసుగుతో 'ఇస్సొబ్బ ఏమిటి నీ గొడవ?' అన్నాడు కండ్లు తెరచి.

"మీకు గొడవలాగేవుంటుంది. పెండ్లీడు వచ్చిన ఆడపిల్ల ఇంట్లోవుంటే తల్లికి ఎంతబాధో మీ కేం తెలుస్తుంది? ఇదివరకు ఆపిల్లలకు ఇద్దరికీ పెండ్లంటే ఆ ముసిలాయనవున్నాడు గనుక దేశాలన్నీ తిరిగి తెచ్చాడు."

"ఎవర్నీ మీ తాతగార్నైనా పొగడ్త. ఇక చాల్లే కట్టిపెట్టు. మీరిద్దరు కలసి ఘనమైన సంబంధాలు తెచ్చారు. శారదాబిల్లని హడావుడిచేసి అంత చిన్నపిల్లకు పెండ్లిచేసి అధోగతిపాల్చేశారు. ఇందుమతికి రోజు లెన్నాళ్లు వెళతాయి. దాని గతేమిటి చెప్పు. పెండ్లిచేస్తానంటే మీవాళ్లు ఒప్పుకోరంటావు? ఇంత కాలేజీలోఅన్నా చేర్పించి చదువుకున్న వరకు చదువు చెప్పిస్తా. పెద్దదాని సంబంధం చూతామా చదువు చాలించాడు. అతని తండ్రి పెద్దవాడైనాడు. అతని ఉద్యోగం విషయంలో ఎన్ని తిప్పలుపడుతున్నానో చూస్తున్నావు గదా? అడ్డమైనవాళ్ల కాళ్లు పట్టుకుంటున్నా గాని ఆలోచించుదామనేవాళ్లు, నెలో రణ్ణెల్లో పోయింతరువాత కనపడు అనేవాళ్లేగాని పది రూపాయల ఉద్యోగం చూపించేవా డెవడు-కనిపించలేదు. ఇవన్నీ చూస్తూ నీకుమట్టుకు ఎల్లాతోస్తోంది ఇప్పుడే పెళ్లిచెయ్యాలని?"

"వాళ్ల గీతకనా చేస్తారు? తిరిగితిరిగి మంచివనే తెచ్చారు. అప్పుడు మీరుమట్టుకు ఒప్పుకోలేదా? ఇప్పుడు ఖర్మం చాల్లేదు గనుక వాళ్లని నన్నుకూడా అంటున్నారు. ఏంచేస్తాం, ఎన్నన్నా పడాలి విధివచ్చినప్పుడు. ఇక ఏకష్టములేకుండా మీరే వెతికితెచ్చుకోండి."

"ఒప్పుకోక ఏంజేస్తాను. శారదాబిల్లనే కత్తి నా గొంతుమీదపెట్టి ఏవో చూపిస్తే సరేనన్నాను. నేను ఇప్పుడు పెండ్లిచెయ్యను. నాకువెతికేపనే లేదు. ఏదన్నా కష్టమొస్తే వాండ్ల గీతని వేదాంతం నేనుచెప్పను."

"అయ్యో! అదేమిటి? అల్లాఅంటారు. పెండ్లి చేయకపోతే ఎల్లాగ? ఇప్పటికే ప్రతిగుడిదగ్గిరా మంచినీళ్ల నూతిదగ్గిరా ఆమ్మాయినిగురించి ఎల్లా చెప్పుకుంటున్నారో వినేదానికి నాకు తెలుస్తుంది."

ఏం చెప్పుకుంటున్నారు. అమ్మాయికి ఇంకా పెండ్లిచెయ్యలేదనేనా? గుడికిపోవడం పదిమంది వకచోట చేరడం వూరికబుర్లు చెప్పనేందుకే కాబోలు. ఆడవాళ్లు వకచోటచేరితే వూరుకోరు. అక్కడ దేవుడు సంగతేమి అక్కర్లేదు కాబోలు. పోనీ చెప్పకుంటే నీకేమీ? నా స్నేహితుడు మాధవరావున్నాడే వాడి కుమార్తె బి.ఏ. చదువుతున్నది. ఇంకా పెండ్లి కాలేదు. ఆమె నెవ్వరు చెప్పుకోటం లేదేం?"

"వారు బ్రహ్మసమాజమతం పుచ్చుకున్నారు గనుక వార్నెవ్వరు అనరు."

"అయితే నేను ఆ మతమే పుచ్చుకుంటా నిరాక్షేపణగా ఇందుమతికి పెండ్లి చెయ్యొచ్చు. దమయంతికి చదువు చెప్పించొచ్చు."

"అయ్యో ఖర్మమా? ఇప్పుడు ఈ సంసారంతో మనం మతం పుచ్చుకుంటే ఏమైపోతానో చూచు

కొండి. మీ నాయగారు వైశ్యదేవంచేశారు. ఆయన ఇక మన గుమ్మం తొక్కరు. మీవాళ్లుమట్టుకు వస్తారా? ఎవ్వరురారు. మగపిల్లలు అధోగతిపాలౌతారు. ఇవ్వేం బుద్ధులు పెద్దవాళ్లైవున్న కొద్దీని? ఏదో సంబంధంచూచి దానికి పెండ్లిచెయ్యక."

"ఆమతం తీసుకున్నవాళ్లంతా అధోగతిపాలైనారా? వాళ్లూ బాగానేవున్నారు మనకంటె ఎక్కువగా. సరే ఆలోచిస్తాను. ఇక నీవు వెళ్లు. కొంచం సేపు పడుకోవాలి" అని శాలువా కప్పుకొని పడుకున్నాడు భాస్కర్రావు.

భానుమతి కిందికొచ్చి చాపమీద పడుకొని ఆలోచిస్తున్నది. ఇద్దరుపిల్లల విషయములోను భర్తగారు అన్నమాటలు నిజమే. తలుచుకుంటే ఆమె గుండె నీరైపోతుంది. పెద్దల్లుడికి ఉద్యోగంలేకపోయినా వున్నది తింటూ కాలం గడుపుతారు. చిన్నదాని జీవితమే దుర్భరం. ఏమనుకుని ఏమి ప్రయోజనం. కాస్త సేపు కళ్లనీళ్లుకార్చి నిద్రపోయింది తానుకూడా.

మధ్యాహ్నం రెండు గంటలైంది. భాస్కర్రావు లేచి క్రిందికివచ్చి "ఏం భాను నిద్రా? కోపమా" అన్నాడు. గాఢనిద్రలోవున్న భానుమతి పలుకలేదు. తట్టిలేపాడు. కండ్లు నులుముకుంటూ లేచి "ఏం వెళ్లుతున్నారా? ఫ్లాస్కులో కాఫీ వుంది. పుచ్చుకొని వెళ్లండి. నిన్నటి మైసూరుపాక్ వున్నది. ఫలహారం చెయ్యరూ" అంటూ కాఫీ ఫలహారము తెచ్చి అందిచ్చింది భర్తకు. కుర్చీలో కూర్చుని ఫలహారం చేసి వెళ్లుతున్నానని కండువా తీసుకొని గుమ్మం దాటుతున్నాడు భాస్కర్రావు.

"ఇదుగో ఆఫీసుకు వెళుతున్నారు కాబోలు. మళ్లీ ఎక్కడికి క్యాంపుకు వెళుతారో. మాఘమాసం కూడ వెళ్లిపోతుంది. ఈనెల్లో తప్పక చేయాలి" అన్నది భానుమతి.

"సరే, బందరు సంబంధమే కొంచము బాగున్నది అన్నిట్లోకి; కాని ఆయన అతి లోభని చెపుతారు. అందుకే కొంచం ఆలోచిస్తున్నా."

"ఆయన లోభితనం మన కేం నష్టం. ఆయనకు ఇంకెవ్వరులేరు గదా. ఆ ముసిలాయన ఎన్నాళ్లు బ్రతుకుతాడు. పాడుచేస్తే కష్టంగాని ఆదుచేస్తే వాళ్లకే లాభంగదా? అదే ఆలోచిస్తే బాగుంటుందేమో. మీ ఇష్టం"

"సరే. వుత్తరం వ్రాస్తాను" అని ఆఫీసుకు వెళ్లాడు భాస్కర్రావు.

౨

వెంకట్రావుగారు చాలా లోభి. ఆయన పెన్షను పుచ్చుకున్నప్పటినుండే లుబ్ధత్వం మరీఅధికమైంది. నిద్రలేవడం కాల్యాలు తీర్చుకున్న వెంటనే దొడ్డిలో చెట్లు కాయలు పళ్లు లెక్కపెట్టడం అమ్మకమునకు పంపవలసిన కాయలు పండ్లు లెక్క వ్రాసి బజారుకు పంపడం, మార్కెట్టుకు తాను స్వయముగా వెళ్లి కొయ్యతోటకూర, పుచ్చువంకాయలు, చింతచిగురు తెచ్చి ఇవి రెండురోజులు రావాలి సుమా, ఇవి ఎనిమిదిపైసాలు పెట్టి తెచ్చా అని భార్యకు ఇవ్వడమూ, ఖజానా లెక్కించుకోవడం, తరువాత కచ్చేరి అరుగుమీద కూర్చుని వాయిదాలు వెళ్లిపొయ్యే నోట్లు వెతుక్కోడము, ఈరోజు కోర్టువాయిదాలేమైన వున్నవేమోనని ఫైలులో చూచుకోడము ఇది వెంకట్రావుగారి దినచర్య.

ప్రొద్దుపొడుపు ఎండకు నులకమంచము అడ్డము పెట్టి దానిమీద జంబుఖానవేసి కంసాలి రామలింగం వేసిన రాగితీగె పక్కపక్కను, స్వయముగా వేసిన నులకతాడు పక్కపక్కకట్టిన కంటిఅద్దాలు వేసుకొని, కోడువిరిగిన దస్కూపెట్టెకు ఇటుకరాయి ఎత్తుపెట్టి, ఆ పెట్టెమీద కాగితాలుపెట్టి చూచుకుంటున్నాడు వెంకట్రావుగారు.

వేసవికాలమగుటచే ఏడుగంటలకే కుమారుడికి

భోజనముపెట్టి ఇంటిపనులన్నీ తీర్చుకుని నాల్గు ప్రాణాలు బిగపట్టుకుని వక్క ప్రాణంతో అడిగింది.

"ఏమండీ! నిన్న గుడివాడనుంచి వుత్తరం వచ్చిందంటిరే ఏమన్నా జవాబు వ్రాశారా?"

తలఎత్తిచూచి కంటద్దాలు పైకి తీసుకుని దారముతో పాలీబిగించిన కందిపుల్ల చెవుకుపెట్టి చిటికెడు నస్యం అరచేతిలో వేసుగుని ముక్కుకు అందిస్తూ "ఏమిటి అంటున్నావు? నిన్నటి వుత్తరమా? ఎందుకంత తొందరపడుతావు పెళ్లో పెళ్లో అని? ఆడపిల్ల గనుకనా పెద్దదౌతుందని భయపడడానికి. నేనూ అదే ఆలోచిస్తున్నా. ఇప్పటికి వాడి చదువుకు నాలుగువేలయింది. అంతవరకున్నా ఇచ్చేవాళ్లువస్తేగదా పెండ్లిచేసేది?"

"అంత ఇచ్చేవాళ్లు రాకపోతె చెయ్యరా?"

"రాకపోతె ఎల్లా చేస్తాను? నీ అబ్బముల్లేమన్నా తెచ్చి ఆనాలుగువేల లోటూపూడుస్తావా?"

"నాఅబ్బ సంగతెందుకు? ఎప్పుడో చచ్చిన వాడిని పెళ్లగించడం. మీ ఇష్టమైతే చెయ్యండి లేకపోతే వూరుకుండి నాకెందుకు? ఏమో వక్కపిల్లవాడు గదా అచ్చటా ముచ్చటా జరుపుకుందామని తోటివాళ్లను చూచి ముచ్చటపడుతున్నాను."

"నేనూ ఆలోచిస్తూనేవున్నా నీకు వియ్యాలవారు ఏవిధంగా ముట్టచెప్పినా నాకు లాభమే. ఈ గుడివాడ వారే మూడువేలిస్తామని వ్రాశారు. లాంఛనాల వగైరా వంకతో ఇంక వెయ్యిగుంజుదాం. ఇదే ఆలోచిస్తాను కానీ తొందరేం."

"మనకు లాంఛనాల కెవరున్నారు నేను వక్కతెనేగా."

"వోసి వెట్టిదానా ఇంత తెలివితక్కువదానివేం? నీచెల్లెలిపిల్లలు ముగ్గురు అక్కపిల్లలు నలుగురు నీతో ఎనిమిదిమంది వేరువేరు నూటపదహారులు అమాంబాపతు ఇన్నింటితో సహా వెయ్యిరూపాయలు చులాగ్గ వస్తై."

"వాళ్లను కూర్చోబెట్టి మనం డబ్బు తీసుకుంటె బాగుంటుందా?"

"బాగుండకేం చేస్తుంది. వాళ్లకే తెలుస్తుందిలే. ఆవుపాయాలన్నీ నేచేస్తాగా. నీవు కూర్చోబెట్టు. వాళ్ళని కాదంటె బొట్టుపెట్టె వగైరా సామానిద్దాం."

"సరే అసలు కుదర్నియ్యండి."

"కుదరకేంచేస్తుంది! ఇది కాకపోతే ఇంకొకటి. ఈఏడు కాకపోతె ముందుకు."

"మళ్లీ అంతలోకొచ్చిందీ ముందుకు. ఆముందుకు అని మనమూ పెద్దవాండ్లమౌతున్నాం గదా కోడలు మనుమలు ముచ్చట తీరొద్దూ. బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరాదంటారు పెద్దలు. ఇప్పుడు ఇరవై ఏండ్లు వచ్చాయి. ఇంకా ఎప్పుడు చేస్తారు? వాడు ఈకాలపు పిల్లవాడు కాడు గనుక సరిపోయింది మీరు చేసే పనులకి."

"వోసి చాదస్తురాలా! మన మేం పెద్దవాళ్లమే? మానాయన నూటపదేండ్లు బ్రతికాడు. మాఅమ్మ నూటపది హేనేండ్లు బ్రతికింది. ఇప్పుడు మనకు ఎన్నేండ్లు? నీకు అరవైన్ని నాకు డెభైయ్యేగా. అప్పుడేటే తొందర కోడండ్లకు మనమలకును కావలసినంత కాలముంది."

"లక్ష్మమ్మగారు! నడుముకు మంత్రం కుడతారా?" అన్నాడు మెహతాదు సుబ్బన్న వచ్చి.

పసిపిల్లను బుజానపడుకుబెట్టుకుని, గరికిపోచ చేతబట్టుకుని, "లక్ష్మమ్మగారు ఇదేందో చూడండి. పొక్కులు పొక్కులుగావున్నాయి" అని అలుగాను కుని నుంచున్నది చాకలివెంకి.

"సుబ్బన్నా నీకు నడుమునొప్పెందుకు పట్టింది రా?" అన్నది లక్ష్మమ్మగారు మంత్రిస్తూ.

"నిన్న కరణంగారి వడ్లబస్తాలు మరకు ఎత్తామండి అప్పుడు పట్టింది. వారబ్బాయి పెళ్లంట. మీ అబ్బాయిగారి పెళ్లెప్పుడూ? అమ్మగారు!"

లక్ష్మమ్మగారు రెండడుగుల వెనక్కి నడుస్తూ అరుగుమీదికి తలవిసిరింది వారి నడగమన్నట్లుగా.

"పంతులుగారు! అబ్బాయిగారి పెండ్లెప్పుడండి? ఇప్పుడు కొత్తమర వచ్చింది. చాలా మంచిదండి. వక్క వడ్లగింజకూడావుండదు. నేనక్కడేవుంటున్నా. తమరుకూడా పంపండి. నిలవ్వుంచకుండా ఆరోజే వేసి పంపుతాం."

"మాకు మరకువేసే అన్ని అవసరములేదురా. రెండు బస్తాలు దంపిస్తే కొల్ల."

"వా రెందుకండి అన్నిబస్తా లేయిస్తున్నారు?"

"వారి కెక్కువున్నాయి కాబోలు వేస్తున్నారు."

"బాబు. మాకందరికీ పప్పన్నం కాబోలు. దబ్బున సెయ్యండి. ఈ ఏడు మా అబ్బాయికూడా పల్లకీకున్నాడు."

"ఈయన డబ్బంతాకూడా తగలేస్తారు గావాలె. పెళ్లిక్కూడా గుప్పెడన్నం వెయ్యకుండా" అని లోలోన ఇద్దరు ఏమోఅనుకుంటూ వెళ్లారు సుబ్బన్నా వెంకి.

లక్ష్మమ్మగారు లోభి కాకపోయినా భర్తముందర ఆమె త్యాగం పనికివచ్చింది కాదు. ఆయన చూడకుండా ఏదన్నా దానం ధర్మం చేస్తూనేవుంటుంది. ఆడపిల్లలు లేకపోవడంచేత ఆవిషయమైన కష్టసుఖాలేమి తెలియవు. లక్ష్మమ్మగార్కి కొడుకు పెండ్లి కావడం తనకు లాంఛనాలు జరగడం చూచుకున్నది గాని ఇంతమందిని ప్రోగుచేసి వారి నెత్తినపెడితే వారి కెంతకష్టమో అనే ఆలోచన ఆవెఱ్ఱి మనస్సుకు తట్టలేదు. అక్కపిల్లలను చెల్లెలిపిల్లలను లాంఛనాలకు ఏర్పాటు చేసుకున్నది. లగ్నం ఎప్పుడు అని ఎదురు చూస్తున్నది.

3

అనుకున్నప్రకారం పెండ్లి అయిదురోజులు దివ్యంగా జరిగిందిగాని అలుక కట్నానికిమట్టుకు పేచీపెట్టి వెయ్యిన్నూటపదహారులు వప్పించారు వెంకట్రావుగారు భాస్కరరావుగారిచేత.

భాస్కరరావుగారిది కొంచం పెద్దకుటుంబం. ఇది వరకు ఎక్కువ ఆదాయంవస్తూండేది గాని ఇప్పుడు అన్నింటికి ధరలుతగ్గటంవల్ల ఆదాయం బొత్తుగా తగ్గినది. ఖర్చులు హెచ్చుతున్నవి. ఈ పరిస్థితులలో సంసారం బొత్తుగా చెడ్డది. ఇల్లా కొన్నిరోజులు గడిచినాయి.

ఒకరోజు భాస్కరరావు ఆఫీసునుంచివస్తూ వుత్తరంతీసుకువచ్చారు.

"భానూ! ఆనాడుఅన్నావు జ్ఞాపకమున్నదా ఆయన లోభితనం మనల్నేంచేస్తుందని ఈవుత్తరం చూడు. మనసంసారం స్థితిచూస్తూకూడా అలుకరోజు వప్పించుకున్న వెయ్యిన్నూటపదహారు ఇప్పుడు ఇస్తేగాని అల్లుడు పునఃస్సంధానానికి రానంటున్నాడని వియ్యంకుడుగారు వ్రాశారు. దీనికికారణం లోభితనమేగదా. ఇప్పుడు ఇన్నిరూపాయ లెల్లా వస్తాయి? ఏమీతోచలేదు. సంబల్‌దీవినుంచి మన రైతువస్తేను కొబ్బరితోటబేరం ఇవ్వమని చెప్పాను."

"అయ్యో! ఆ కొబ్బరితోట కాస్తా అమ్మేస్తే ఇక ఆ పల్లపుపొలంలో వచ్చేదేమిటి? మనం తినేదేమిటి? ఈ కట్నముల దురాచారం తొలగించేవారు లేరు గదా?"

"ఎవరు మాన్పుతారు. ఎవరికి వారికే కావాలా యిక మాన్పేవారెవరు."

"పోనీ, రేపు నీవు మాన్తావా? నీ కొడుకులకు పుచ్చుకోకుండా?"

"నిరభ్యంతరంగా మాన్తాను. మన పిల్లలను అమ్ముకోవడం నా కిష్టంలేదు. నరమాంసం అమ్మినట్లేగా?"

"ఇప్పుడిలాగే అంటావు. అప్పుడు నీవూ గునుస్తావు. కొంచం తక్కువైతే మీరే చెడిచారంటావు నన్ను. నీవు మాను. ఇంకా కొందరు వెంటనే మాన్తారు."

"ఇప్పుడెందుకు చూడండి. వక్కపైసా అయినా కట్నము లాంఛనాలు లేకుండా పెండ్లిచేసుకొచ్చి లోకానికి సంఘానికి ఆదర్శము చూపించుదాం."

"సరే. ఇప్పుడు వారికేం వ్రాయమంటావో చెప్పు?"

"నే నేం చెప్పను, పిల్లకు సారెపెట్టి పంపేప్పుడు ఇస్తామని. ఇప్పుడు దయచేసివస్తే శక్తికొలది వేడుక చేసి పంపుతామని వ్రాయండి."

౪

పిల్లను వారింట్లో వుంచిబెట్టు చేయడంకంటే మనింటికి తీసుకువచ్చి డబ్బిస్తేగాని పిల్లను పంపనంటే డబ్బు తొందరగా వస్తుందనే వుద్దేశ్యముతో అక్కర తీర్చి కోడల్ని తీసుకుచ్చారు వెంకట్రావుగారు. సంక్రాంతిపండుగ వస్తున్నది ఆడపిల్లల పండుగ ఎల్లాగైన డబ్బిచ్చి పిల్లను తీసుకువెళ్లుతారు గదా అని పండుగకొరకు ఎదురుచూస్తున్నాడు. డబ్బు ఎక్కువకూడిన కొలది మరియాదకూడా ఆలోచించటంలేదు. డబ్బే ఆయన మొదటి ప్రాణంగావున్నది.

పండుగ వచ్చేసరికి దమయంతికి నాలుగు నెలలు వచ్చినాయి. ముఖము తెల్లపడ్డది. బొత్తుగా చిక్కిపోయింది. అత్తగారి ఆదరణకంటె మామగారి నిరసన అనాదరణ ఎక్కువగావున్నది. ఏమైతే నేం చేస్తుంది. భర్త నిరుద్యోగి, మామగారు పెడితే తినాలి, లేకపోతే పడుకునాలి. అన్నింటికి వోర్చుకుని కాలం గడుపుతున్నది దమయంతి. సరి నెలలు కావడంచేత పండుగకు పుట్టింటికి పంపలేదు. తరువాత దమయంతి తండ్రి వచ్చి వియ్యంకుడిని అడిగి కుమార్తెను ప్రయాణముచేసి తీసుకు వెళుతుండగా భర్తగారి పోరుపడలేక బండిదాకావచ్చి లక్ష్మమ్మ చెప్పింది "అన్నగారు! మీ బావగారి సంగతి మీకు తెలుసు గదా. సురక్షితముగా పిల్లను పంపేటప్పుడు మరిచిపోవద్దు" అని. వెంకట్రావుగారు రైలుదాకా వచ్చి పైకం విషయమై హెచ్చరించి పిల్లవాడి ఉద్యోగంనిమిత్తం ఈపైక మవుసరమని గట్టిగా చెప్పాడు. ఈకథంతా చూస్తూంటే దమయంతి భర్తయైన మోహనరావుకు ఇది వక నాటకంగా వున్నది అని ఆలోచిస్తున్నాడు.

౫

దమయంతికి ఆడుశిశువు కలిగి ఆరునెలలైంది. ఇంతవరకు అత్తవారు తీసువెళ్లుతామని పంపమనిఐనా కబురులేదు. బారసాల చేసుకోమని కబురుపంపితే వెయ్యిన్నూటపదహార్లు వడ్డితోసహా ఇస్తే తన కొడుకును పంపుతానని వియ్యంకుడు కబురుచేశాడు. భాస్కరరావుగారి స్థితి బొత్తుగా చితికిపోవడంచేత వక్కమాటు ఇంతమొత్తం ఇవ్వలేక వూరుకున్నారు. తల్లి మిల్లోనగలుకూడా పెండ్లికే ఖర్చైనవి గనుక ప్రస్తుతం వీరు ఇచ్చేది కనిపించలేదు. దమయంతిని వారు తీసుకువెళ్లేది కనిపించలేదు. అత్తవారింట వున్నది కొద్దిరోజులైనా భర్తప్రేమ ప్రతిక్షణము జ్ఞాపకము వస్తూనేవున్నది దమయంతికి.

తండ్రిగారు ఈవిధముగా తన్ను బజారువస్తువుగా మార్చడము, తాను తండ్రిచేతి కీలుబొమ్మవలె తండ్రిగారు ఏదిచేయమంటె అదిచేయడము, తనకు వుద్యోగము దొరక్కపోవడము, తన భార్యా బిడ్డాకూడా తండ్రి స్వార్జితపు ఆస్తిమీద ఆదారపడి ఉండటము, తండ్రి లుబ్ధతకు సహాయము, కట్నాల దురాచారము ఆలోచించుకుంటే తన జీవితము దుర్భరమని తోచింది. ఈ వెధవకట్నము గదా ఇంతకాలంనుంచీ అంత ప్రేమగల భార్యను ముద్దులుజూపే బిడ్డను ఎడబాటు చేసింది. ఈ కట్నాల దురాచారమునకు నా జీవితాన్ని బలిఇచ్చి సంఘానికి ఆదర్శముచూపుతాను అనుకుని డబ్బుతోసహా భార్యను తీసుకువస్తానని తండ్రిగారికి చెప్పి రైలుదేరి గుడివాడ వచ్చాడు మోహనరావు.

అల్లుడిరాక చూచి అత్తగారు మామగారు అందరు పరమానందభరితులైనారు.

భానుమతి అల్లుడు రాకరాక వచ్చినందుకు పిండి వంటలతోసహా భోజనముపెట్టింది. అంతా ఎక్కడి వాళ్లక్కడ పడుకున్నారు.

"దమయంతీ! నేను ఇన్నిరోజులనుంచీ రాకపోతే నీవు ఏమనుకున్నావు?"

"ఏమీ అనుకోలేదు. మా తండ్రిగారు డబ్బు ఇవ్వలేకపోబట్టికదా నా జీవితము ఈవిధముగా వున్నది అనుకున్నాను. ఇప్పుడు వారికి డబ్బుకు చాలా ఇబ్బందిగావున్నది. ఆడపిల్లలమూలమున వారి స్థితి ఈవిధమైంది. మేము పుట్టుకపోయినా బాగుండేది."

"ఐతే నిన్నెప్పుడు పంపుదామనుకున్నారు?"

"ఇక వక కొబ్బరితోట మూడెకరముల పల్లపు భూమి వున్నది. అది అమ్మిఇచ్చి పంపవలెనని ఆలోచిస్తున్నారు."

"అయ్యో పాపం. అది కాస్తాఅమ్మితే ఇక వారి జీవనం ఎల్లాగా? మీ తమ్ములు ఇంకా సంపాదించటం లేదు గదా?"

"సంపాదనేమిటి చదువులే పూర్తికాలేదు."

"ఇక వారు జీవనం ఎల్లాచేస్తారు?"

"నన్ను పంపినతరువాత వారి తిప్పలు వారివి. మా నాన్నగారికి పెనషను. అది చాలకపోతే? ఉపనయనమునాటి మాటవున్నది సుమతీ! అని పెద్దలన్నారు. ఇక నాలుగు కొంగులు ముడే వారిజీవనం."

"అబ్బా ఎంత కష్టము?"

"ఆడపిల్లలను కన్నవారికి ఎంత కష్టమైనా తప్పదు."

"దమయంతీ! ఇక నాకు సెలవు."

"అదేమి? నన్ను తీసుకునివెళ్లరూ?"

"నేను ఇప్పుడు ఇంటికి వెళ్లుటలేదు."

"ఎక్కడికి వెళ్లుతున్నారు?"

"దేశాంతరము."

"నేను చెప్పిన మాటలనుబట్టి డబ్బులేకుండా నన్ను తీసుకువెళ్లవలసివచ్చినదని కాబోలు. ఇల్లా అబద్ధాలాడుతున్నారు? రేపు తప్పక డబ్బు వస్తుంది. డబ్బుతోసహా నన్ను తీసుకువెళ్లవచ్చు."

"రామ రామ! ఇక ఆ డబ్బుమాట నాముందర తలపెట్టవద్దు. ఆడబ్బుతో నాకు ఏవిధమైన సంబంధములేదు. నీదగ్గిర శెలవుతీసుకుని ఇక నాదారి నేను చూచుకోటానికి వచ్చాను."

"తమరు నాదగ్గర శెలవు తీసుకోటానికి వచ్చానని హాస్యపుమాట లెందుకూ? పసిదానను ముక్కుపచ్చలారని పదునైదు సంవత్సరముల బాలను నా దగ్గర మీరు శె. వడుగుట ఎంత హేయము."

"నీ మాటలు పొరపాటు. అగ్నిసాక్షిగా పెండ్లాడి అదియునుగాక నాలుగువేల రూపాయలకు నీకు అమ్ముడుపోయిన నేను నీకు తెలియకుండా ఏ కార్యమును చేయుటకైనను మానవమాత్రుడనైన నాకు ఎట్లు స్వతంత్రత కలుగును?"

"మీ మాటలు నా కర్థం కావటంలేదు. మీరు చేయదలచిన కార్య మేమో నాకు విపులంగా చెప్పండి."

"నేను దేశాంతరము వెళ్లుతాను. నీవు ఇక్కడే వుండు."

"మీరు దేశాంతరము వెళ్లుటకు కారణమేమి?"

"మా నాయనగారే కారణము. మీవారికి భిక్షాపాత్ర చేతికిచ్చి ఇంకా రూపాయలు తెమ్మనుట నా కిష్టములేదు. తీసుకురానిదే మా నాయనగారు రానీయరు. ఈరోజులలో నాకు ఎక్కడా వుద్యోగము కూడా దొరికేటట్లు కనిపించలేదు. గనుక ఈపని నా బుద్ధికి బాగున్నది."

"సరే, నాకూ బాగానేవున్నది నేనుకూడ వస్తాను, మీరు వెళ్లేచోటికి."

"నీవు వచ్చునది కాదు అస్థలము. చిన్నదానవు.

ఆరునెలల పసికందును తీసుకునిరాలేవు. గనుక సుఖముగా మీవారి దగ్గరవుండు."

"మీరులేని సుఖము నాకు సుఖముకాదు. ఇన్ని దినములనుంచీ ఎప్పుడు మంచిరోజుల వచ్చునా ఎప్పుడు తీసుకుని వెళ్లుతారు అని మీలేఖల కన్నుల నద్దుకుంటూ నిముసములు గంటలు లెక్కించుచూ కాలము గడుపుతున్నాను గాని మీరు దేశాంతరులైన తరువాత నాకు ఈ ప్రపంచముతో పనిలేదు."

"చిన్నదాననని నీవే చెప్పావుగదా, ఏమో కఠినముగా మాట్లాడుతున్నావే?"

"మీరు చెప్పినదే కదా అగ్నిసాక్షిగా పెండ్లియాడినానని. అట్టి అర్ధాంగినివిడచి అర్ధశరీరము వెళ్ల తలచుకున్నారా?"

"దమయంతీ! అందుకే నీవద్ద ఆజ్ఞగొని వెళ్ల తలచాను"

"అనుజ్ఞలేనిచో ఏమి చేసెదరు?"

"బలవంతముగానైనా వెళ్లతలచాను."

"అట్టి బలవంతపు పని నేనుకూడా చేయవచ్చునన్న మాటేనా?"

"నీవు ఎంత బలవంతపెట్టినా నిన్ను తీసుకొని వెళ్లను. నీవు ఇక్కడనేవుండు" అన్నాడు మోహనరావు కోపంగా.

"మీ ఇష్టము వచ్చినప్పుడు పెండ్లియాడి ఇష్టము వచ్చినప్పుడు విసర్జించుటకు పుచ్చిపోయిన వంకాయ కాదు గోడవతల పారవేస్తే పోవటానికి. అగ్నిసాక్షిగా పెండ్లియాడిన ధర్మపత్ని మీరు వెంటతీసుకుని వెళ్లినాసరే, లేనిచో నావంతే నే చూచుకుంటా" అన్నది దమయంతి గంభీరంగా.

"నీవు ఈవిధముగా మాట్లాడుతూంటే నేను నిజము దాచలేను. నా జీవితము విరమించదలచాను."

"అయ్యో నాథా! నిజమా! మీ జీవితములేనిచో నాకు శరణ్యమేది. నా జీవితముకూడ మిమ్మనుసరిస్తుంది. మీరు నాకుకూడ సెలవియ్యండి" అన్నది దమయంతి గద్గదకంఠముతో.

"హరి! హరీ! ఆశిశువు నీకొరకు అల్లాడదా? అట్టిపని నీవెన్నడు చేయవద్దు. పతిమాట శిరసావహించుటయే పతివ్రతలక్షణము. నామాట విని నీవు సుఖముగా మీ పుట్టింటవుండు. ఇదే నాకు సెలవు."

కండువా గట్టిగాపట్టుకుని "ఆవులుపోతూ లేగలకు మేతపెట్టునా? ఆ శిశువుతో మీకు లేని సంబంధము నాకుందా? భర్తృవిహీనవై జీవించుటంటె కష్టమో సుఖమో మరణమో భర్తతోడి లోకమే పతివ్రతలక్షణము. మీరు దారి చూపకున్నారు. ఇవిగో నా కేశములు, ఇదుగో నా పమిటచెరుగు, ఇవే నాకు దారిమాపును" అని వేల్లవాలింది దమయంతి.

"దమయంతీ లే. ఇచ్చట మన మే ఘోరకృత్యము చేసినా మీ నాన్నగారు కష్టాలపాలౌతారు, గనుక బైలుదేరుము. ఇంటిదగ్గర ఏదో ఆలోచిద్దాం."

ఈమాట విని దమయంతి అతిఉత్సాహముతో లేచి ప్రయాణమై తల్లికి తండ్రికి చెప్పబోయింది. డబ్బువిషయమై వారు అడిగితే ఇప్పుడు అవసరము లేదట, ఎప్పుడో వున్నప్పుడు ఇవ్వవచ్చునట అని చెప్పి అమ్మా వెళ్లుతున్నానని బండి ఎక్కింది దమయంతి. రెండు కన్నీటిబొట్లు క్రింద రాలినై. శరవేగముతో వెళ్లింది గుఱ్ఱపుబండి రైలుస్టేషనుకు.

"డబ్బు ఇవ్వకుండా పంపాముగదా. ఏమి కష్టపెడతారో అత్తవారు" అని తల్లిదండ్రులు విచారపడ్డారు గాని ఏమనుకుని ఏమి ప్రయోజనం?

౬

పంచమీ సోమవారం రాత్రి పది గంటలకు వెంకట్రావుగారి వాకిట్లో బండి ఆగింది. డబ్బుతో సహా కోడలు వచ్చిందని మంచమ్మీదనుంచి త్రుళ్లిపాటుతో లేచి తలుపుతీశాడు వెంకట్రావుగారు.

కొడుకు కోడలు ఇంట్లో ప్రవేశించారు. లక్ష్మమ్మగారి ఆనందానికి మేరలేకుండావుంది. మనుమరాల్ని ముద్దులాడింది. కోడిల్ని దగ్గరకుతీసుకుని కుశలప్రశ్న లడిగింది. మామగారికికూడా సంతోషముగానే వున్నది గాని డబ్బు కంటికి కనిపించినగాని మనస్సు కుదుటపడేటట్లు లేదు. ఏమైనగాని కొడుకు నడగాలనుకున్నాడు.

"ఒరే మోహను! ఇల్లారా వకమాటు."

"ఏమిటి నాన్నగారు?"

"చీకటి కాలం ఏది ఆ పైకం ఇల్లాఇయ్యి."

"నాన్నగారు ఇప్పుడేం తొందర? నీ కోడలు కూడా జాగ్రత్తమనిషే. తలక్రింద పెట్టుకు పడుకొంటుంది. రేపు ప్రొద్దున్న తీసుకుందుగాని ఇప్పుడే అడిగితే దాని మనస్సు కష్టంగావుంటుందేమో?"

"సరే. వెళ్లిపడుకోండి" అని తన నులకమంచమ్మీద పడుకున్నాడు వెంకట్రావుగారు.

మోహనరావు ఒక వుత్తరం వ్రాసి తలక్రింద పెట్టుకున్నాడు. "దమయంతీ! ఇదుగో నా జీవితము పూర్తిఅయింది. నీ యిష్టం. నా చేతిమీదుగా నేను ఇవ్వలేను" అని ఏదో గొంతులోపోసుకుని పడుకున్నాడు. దమయంతికూడా మిగిలింది త్రాగి సీసా నిండా పాలుపోసి పిల్లపక్కలో పెట్టి తాను వేరే మంచముమీద పడుకున్నది. తెల్లవారింది. ఇంకా లేవలేదు. ప్రయాణపు బడలికవల్ల లేవలేదనుకున్నది అత్తగారు. పసిబిడ్డ లేచి ఏడుస్తున్నది. గదిదగ్గరకు వచ్చి పిలిచింది. లేవలేదు. తలుపునెట్టి లోపలకి వెళ్లి తట్టిలేపింది. లేవలేదు. లక్ష్మమ్మగారికి కాళ్లు చేతులు వణుకుతున్నాయి. ఎల్లాగో ప్రయత్నము చేసి భర్తను పిలిచి గొల్లుమన్నది. కొంపమునిగింది రండీ అన్నది. వెంకట్రావుగారు వచ్చి చూచారు. ఏముంది? అంతా నిశ్శబ్దం. లక్ష్మమ్మగారు నెత్తి మోదుకొంటూ ఏడుస్తున్నది. వూరుకోవే అని నోరుమూసి వెంకట్రావుగారు పరుపుపక్కలు వెతకడం మొదలుపెట్టారు. ఎక్కడా పైకం దొరకలేదు గాని మోహనుడిపక్క క్రింద ఒక వుత్తరంవున్నది. అది విప్పిచదివితే ఈవిధంగావున్నది.

"మహారాజశ్రీ గ్రామాధికారియైన మున్సీబుగార్కి.

ఆయ్యా! వివాహముల సంతలో పురుషపశువులను కొనుటకు స్త్రీరత్నములను కనిన తలిదండ్రులు స్థిరచరాస్తులను అమ్ముకొని భిక్షాటనకు బైలుదేరుతున్న దుస్థితినిచూచి భరించలేక నాజీవితము విరమించుచున్నాను. నావంటి త్యాగస్వభావులు కొంతమంది బైలుదేరి సంఘమునకు ప్రపంచమునకు ఆదర్శము చూపినగాని కట్నములనే పేరుతో విక్రయించే వరవిక్రయములు తగ్గి సంఘము బాగుపడదనే వుద్దేశ్యముతో నేను ఈపనికి పూనుకొంటిని. వరులను విక్రయించే మార్కెట్టులో మా నాయనగారుకూడా భాగస్తులే గనుక నేనుగూడ అమ్ముడుపోయిన పశువునే. అట్లు అమ్ముడుపోయి జీవించుట ఇష్టము లేకనూ ముందు వివాహములు చేసుకునే యువజనులకు దారిచూపుటకునూ నా జీవితము ఇట్లు చేయుచున్నాను. నేను లేనిదే జీవించుటకు ఇష్టములేక నా ధర్మపత్నిగూడా నన్ననుసరించినది. గనుక ఈవిషయములో మా తండ్రిగారి జోక్యము లేదు. ఇహలోకమున నాయందు తప్పులున్ననూ క్షమింతురుగాక యని కోరుచు ఇంతటితో నా జీవితమును విరమించుచున్నాను.

ఇట్లు

మోహనుడు."